94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21



త్వరలో మీముందుకు రానున్న
'ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కాంటాక్ట్ బుక్‌లెట్'
రాజధాని వార్తలు ప్రత్యేక సంచిక ఫోన్ : 9440662699

# రాజధాని వార్తలు
RAJADHANI VARTALU

కేవలం 1000 రూపాయలకే



విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో ఏసి మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం 1000 రూపాయలకే ఇందులో 50 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును. ఫోన్: 94406 62699

అమరావతి సంపుటి : 4 సంచిక : 45, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 12 - ఆదివారం 18 ఆగస్టు, 2019
Amaravati Volume : 4 Issue : 45, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 12 - Sunday 18 August, 2019

వివరాలు2లో...


మీసేవా కేంద్రాలకు చెల్లు

వివరాలు3లో...

ఓ అన్నా.. నీ అనురాగం

వివరాలు4లో...

కాశ్మీర్ ఖైదు

వివరాలు4లో...

అల్లాహ్ దయగలవాడు


## విద్యాశాఖపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలను మార్చడంపై విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తొలివిడతలో 12,918 ప్రాథమిక పాఠశాలలు, 3,832 హైస్కూళ్ల రూపురేఖలు మార్చాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, నీళ్లు, ఫర్నిచర్, పెయింటింగ్స్, తరగతి గదులకు మరమ్మతులు, బ్లాక్‌బోర్డ్స్ కార్యక్రమాలతో పాటు అదనపు తరగతి గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 98 శాతం అంటే సుమారు 42,655 పాఠశాలల వీడియోలు, ఫొటోలు తీసిన విద్యాశాఖ దాదాపు 10.88 లక్షల ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

అన్ని సదుపాయాలు కల్పించిన తర్వాత మళ్లీ ఫొటోలు తీసి ప్రజలముందు ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొన్నిచోట్ల అన్ని తరగతులకూ ఒకే టీచర్ ఉన్నారన్న విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి తరగతికి తప్పనిసరిగా ఒక టీచర్ ఉండాలని, విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టీచర్లను నియమించాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఖాళీలను భర్తీ చేయడానికి నియామకాల కోసం క్యాలెండర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## 12న మరో అల్పపీడనం!



**రాజధాని వార్తలు, విశాఖపట్నం :** వాయుగుండం బంగాళాఖాతం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈనెల 12 నాటికి అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన వాతావరణం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈమధ్యే అక్కడ ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి..ఆ తర్వాత తీరందాటి క్రమంగా బలహీన పడింది. ప్రస్తుతం అది వాయుగుండంగా పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్ మీదుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది మరింత బలహీనపడే అవకాశం ఉందని తెలిపారు.

# రోగాలు వస్తాయి జాగ్రత్త

● వృద్ధి చెందుతున్న దోమలు ● ముందస్తు జాగ్రత్త అత్యవసరం

**రాజధాని వార్తలు, వత్సవాయి :** ఖరీఫ్ సీజన్‌కు రెండు నెలలు ఆలస్యంగా వర్షాలు రావడంతో వాతావరణంలో వేగంగా మార్పులు సంభవిస్తున్నాయి. ఇంటిచుట్టుపక్కల ప్రాంతాలు చెత్తాచెదారాలతో నిండివుండటం వలన వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దోమలవల్ల మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాపిస్తాయి. గత సంవత్సరం అక్టోబర్ నెలలో వందల సంఖ్యలో ప్రజలు రోగాలబారిన పడి మండలంలోని మాచినేనిపాలెం గ్రామంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగేనీరు, తినే ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలి కొంచెం జ్వరం ఉన్నా వైద్యుని సంప్రదించాలి.

**అతిసార వ్యాధి**

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వలన అతిసార వ్యాధి వస్తోంది. కడుపునొప్పితో

పాటు వాంతులు, విరోచనాలు మొదలై శరీరంగా ఒక్కసారిగా నీటిశాతం తగ్గిపోతుంది. చర్మం సహజస్థితిని కోల్పోవడంతోపాటు నాలుక ఎండిపోతుంది.

ఈ లక్షణాలు కనిపించిన వెంటనే కాచిచల్లార్చిన నీటిలో చిటికెడు ఉప్పు, రెండు చెంచాల పంచదార కలిపి బాధితునితో తాగిస్తే ఉపసమనం కలుగుతుంది. ఓఆర్ఎస్ ద్రావణాన్ని కూడా నీటిలో కలిపి ఇవ్వవచ్చు. ఇలా చేసినప్పటికీ మనిషి కోలుకోకపోతే తక్షణమే వైద్యునిసంప్రదించాలి.

**మలేరియా....**

సాధారణంగా జూన్ నెల నుంచి అక్టోబర్ వరకు మలేరియా వ్యాప్తి చెందుతోంది. ఆడ ఎనాఫిలిన్ దోమకాటు వల్ల జ్వరం వస్తుంది. రోజువిడిచి రోజు జ్వరం రావటం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వణుకుతో కూడిన చలి రావడం, చెమటలు పట్టడం, వాంతులు వంటి లక్షణాలు మలేరియా జ్వరానికి సూచనలు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్సపొందాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం.



**మలేరియా రాకుండా ఇలా చేయాలి...**

దోమతెరలు వాడటం, కిటికీలు, దర్వాజాలకు సన్నటి జల్లెడను వాడి దోమలు ఇంటిలోపటికి రాకుండా చేయాలి. చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల్లో ఖాళీ కొబ్బరిబొండాలు, టైర్లు, పనికిరాని కూలర్లు

ఉంకుండా చూసుకోవాలి. ఇంటిపై వాటర్ ట్యాంక్‌లకు మూతలు బిగించాలి. సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టాలకు దోమతెరలు లాంటి ఇనుపజాలీని బిగించుకోవలి.

**ప్రాణాంతకమైన డెంగ్యూ..**

డెంగ్యూ వ్యాధి కారక క్రిమి ఆర్బోవైరస్ జాతికి చెందినది. ఈ వైరస్ కంటికి కనిపించని అతి సూక్ష్మమైనది. ఈ వైరస్ ఏడిస్ ఈజిప్ట్ జాతి దోమ ద్వారా సంక్రమిస్తుంది. దీనిని టైగర్ దోమ అనికూడా అంటారు. ఈ దోమ రోగిని కుట్టి ఆరోగ్యవంతుడిని కుట్టడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమలు సాధారణంగా పగటి వేళల్లో కుడతాయి. కుట్టిన తరువాత ఐదు నుంచి ఎనిమిది రోజుల వ్యవధిలోనే జ్వర లక్షణాలు కనిపిస్తాయి.

**ఈ లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి..**

ఉన్నట్లు ఉండి తీవ్రంగా జ్వరం రావడం, తలనొప్పి, ముఖ్యంగా నొసటిపై ఎక్కువగా నొప్పి కలగటం, కంటి కదలికలు తగ్గటమే కాకుండా కళ్లను కదిలించినప్పుడు భరించలేని నొప్పి

- మిగతా 2 లో

## నిరక్షరాస్యతను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

**రాజధాని వార్తలు, అమరావతి :** ఇటీవల విఐటీ ఏపీ వర్సిటీలో 'స్టార్స్' 3వ బ్యాచ్ శుక్రవారం ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే సంకల్పంతో తమ వర్సిటీ స్టార్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు విఐటీ ఏపీ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) చదివి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు విఐటీ ఏపీ వర్సిటీలో నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సుతో పాటు వసతిని ఉచితంగా కల్పిస్తున్నామని వివరించారు. స్టార్స్ 3వ బ్యాచ్ కార్యక్రమాన్ని, వర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన సింథటిక్ టెన్నిస్ కోర్టుని తాటికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ..విఐటీ అంటే విజన్, ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫార్మేషన్ అని అభివర్ణించారు. స్టార్స్ 3వ బ్యాచ్ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ డి.శుభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ సీఎల్వీ శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్) డాక్టర్ ఖాదర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మీడియా చీఫ్ డైరెక్టర్‌గా దేవేందర్‌రెడ్డి



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖలో చీఫ్ డిజిటల్ డైరెక్టర్‌గా వైఎస్సార్‌సీపీ నేత గుర్రంపాటి దేవేందర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఎక్స్‌అఫీషియో కార్యదర్శి (ఐఅండ్‌పీఆర్) టి.విజయ్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. దేవేందర్‌రెడ్డి వైయస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. రెండేళ్లుగా పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారు. తనను ఈ పదవిలో నియమించినందుకుగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ ఇతర ముఖ్య నేతలకు దేవేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## గోదావరి రౌద్రం



**రాజధాని వార్తలు, రాజమహేంద్రవరం :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరికి వరద మరింత పెరిగింది. గోదారి ప్రవాహం అత్యంత ప్రమాదకరంగా సాగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 15.6 అడుగుల నీటిమట్టం ఉంది. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. డెల్టాకాల్వలకు 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 15.51 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద గోదావరిలో 44.8 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

**కోనసీమ గ్రామాలు జలదిగ్బంధం**

తూర్పుగోదావరి జిల్లా కోనసీమ ప్రాంతాలు ఇంకా వాననీటిలోనే నానుతున్నాయి. గత 10 రోజులుగా గోదావరి నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కోనసీమలోని అప్పనపల్లి, జి.పెదపూడి, ముక్తేశ్వరం గ్రామాల్లోని కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తోంది. బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక సహా అనేక లంక గ్రామాలు నీట మునిగాయి. దీంతో అక్కడి ప్రజలు మర పడవలు, నాటుపడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వేలూరుపాడు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలను అధికారులు పునరావాసాలకు తరలించారు.



తాడేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఉదయం నూతన కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది.

## 25న వీఆర్‌వోల సంఘం రాష్ట్ర సదస్సు

**రాజధాని వార్తలు, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం(వీఆర్ఓ) రాష్ట్ర సదస్సుని ఈ నెల 25న ఉదయం 10 గంటలకు తమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఆంజనేయకు మార్, సి. హెచ్. సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సదస్సులో రాష్ట్రంలో వీఆర్ఓల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

## 11న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వలంటీర్ల ఆత్మీయ సమావేశం

**రాజధాని వార్తలు, అమరావతి :** వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వలంటీర్ల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ విభాగం రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ జి. దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి సీఎస్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిధిగా పార్టీ జాతీయా ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

## తొలిసారిగా 'ఒపెక్' దేశాల ఆసక్తి



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని, తొలిసారిగా 'ఒపెక్' (పెట్రోలియం ఎగుమతి దేశాల కూటమి) దేశాలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం సంతోషం కలిగిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో ప్రపంచస్థాయిలో పోటీ పడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. పరిశ్రమల మేర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. విజయవాడలో డిప్లొమాటిక్ ఔట్ రీచ్ కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని మంత్రి క్లుప్తంగా వివరించారు. జపాన్, కొరియా, సింగపూర్, బ్రిటన్, చైనా, ఆస్ట్రేలియా లాంటి 25కిపైగా దేశాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. ఆహార రంగంలో జర్మనీ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తోందన్నారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో కూడా ఏపిలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయన్నారు.

## కశ్మీర్ గవర్నర్‌గా విజయకుమార్



**న్యూఢిల్లీ :** జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి విజయ్ కుమార్ నియమకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోన్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్లు చేయడంలో స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందిన విజయ్ నియమానికి రాష్ట్రపతి కూడా సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రేపోమాపో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దీంతో కశ్మీర్ తొలి ఎల్జీగా నియామకమైన అధికారిగా విజయ్ గుర్తింపు పొందనున్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ కేంద్రం తరఫున ప్రతినిధిగా లెఫ్టినెంట్ గవర్నర్ ఉంటారు.ప్రస్తుతం జమ్మూకశ్మీర్, లఢక్ వ్యవహారాలను గవర్నర్ సత్యపాల్ మాలిక్ చూస్తున్నారు. ఇప్పుడు రెండు ప్రాంతాలకు వేర్వేరుగా లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించి.. అక్కడ పాలనను గాడిన పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రిటైర్డ్ ఐపీఎస్ విజయ్ కుమార్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్టు ఢిల్లీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. మరోవైపు ఆయన నియమకానికి సంబంధించి అధికారిక ప్రకటన రాకముందే సోషల్ మీడియాలో విజయ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుత్తున్నాయి.

విజయ్ కుమార్ తమిళనాడుకు చెందిన 1975 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కర్ణాటక–తమిళనాడు ప్రభుత్వాలకు కంటిలో నలుసులో మారిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను 2004 అక్టోబర్‌లో అంతమొందించిన తమిళనాడు స్పెషల్ టాస్క్ ఫోర్స్ చీఫ్‌గా వ్యవహరించారు. వీరప్పన్‌ను పట్టుకున్న తర్వాత విజయ్ పేరు ప్రపంచానికి తెలిసింది. అంతేకాదు చెన్నై పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో..

- మిగతా 2 లో

ఆత్మబంధువు, రైతు బాంధవుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి
స్వాగతం.. సుస్వాగతం...



రైతుల కోసం రైతు భరోసా వంటి
ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన
గౌరవ ముఖ్యమంత్రి
వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారికి
ఎన్నారైల తరపున స్వాగతం,సుస్వాగతం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, మరియు ఉమాశంకర్ మరెడ్డి, వీర సురవరం, హనిమి మేరువ, రాజేందర్ చావా, రామనాథ్, వెంకట పులుసు, శంకర్, హరి అర్రనగు, పార్వతి, లక్ష్మి అల్లా, అంజిరెడ్డి కుడుమ్మాళ్, సీతారెడ్డి గోగులమూడి, శంకర్, నరేష్ కొండూరి, సత్య కొండా, సురేష్ తనమల, అమర్నాథ్ బడే, హరీందర్ శీలం, సురేంధేర్ పులగం, ప్రవిణ, బోస్, అఫ్జల్, వాసు, నవీన్.

కె.బైలీ హట్‌చిన్‌సన్ కన్వెన్షన్ సెంటర్, 650 ఎస్ గ్రిఫిన్ స్ట్రీట్ డాల్లస్, టెక్సాస్
సమయం : 17-08-2019 2 గం. నుండి 7 గం. వరకు

www.cmysjaganusa2019.com

రాజధాని వార్తలు కలం

# పైకొకటి..లోన మరొకటి

ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టికల్ 370 తొలగింపుతో జమ్ము కాశ్మీర్‌కు ఉగ్రవాదం, వేర్పాటువాదం మాసిపోతాయని వెల్లడించారు.అయితే ఆయన స్వప్రయోజనాలకోసం ఇలా మాట్లాడటం ఇదే తొలిసారి కాదని భారత ప్రజలకు తెలుసు. 2014 ఎన్నికల ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లోనుంచి 100 రోజుల్లో నల్లధనం తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షల దేశ ప్రజల ఖాతాలో జమ చేస్తానని బాకా ఊది తీరా అధికారం చేపట్టాక దాని ఊసే ఎత్తలేదుకదా.. పెద్ద నోట్లు రద్దు చేస్తూ 2016 నవంబర్ 8 రాత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించిన మోడీ దేశంలో ఇకముందు నల్ల ధనం, అవినీతి వుండబోవనీ, నకిలీ నోట్లు అంతరించిపోతాయనీ, ఉగ్రవాదాన్ని తుదముట్టిస్తాననీ ఇంతకంటె గొప్పగా చెప్పారు. కాని జరిగిందేంమిటి ఆయన అంతరంగికులు, సన్నిహితులు నల్లధనాన్ని తెల్లగా మార్చుకున్నారు. నవంబర్ 13న గోవాలో మాట్లాడుతూ 50 రోజులు సమయమివ్వండి, డిసెంబర్ 30 నాటికి పరిస్థితి పూర్తిగా సాధారణమౌతుంది, అలా కాకపోతే నడిరోడ్డుపై తనను ఉరి తీయమని చెప్పిన సంగతి అప్పటి పతాక శీర్షికలకెక్కింది. కానీ, రద్దు చేసిన నోట్లలో 99.3 శాతం తిరిగి బ్యాంకులకు చేరిపోవడంతోపాటు ఘనంగా పేర్కొన్న నాలుగు లక్ష్యాలూ నీరుగారిపోవడం, నోట్ల రద్దు ప్రక్రియ ఓ పెద్ద ప్రహసనంగా మిగిలిపోవడం చూశాం. కానీ మోడీ మాత్రం ప్రధానిగా కొనసాగుతూనే వున్నారు. ఆయన పబ్బం గడుపుకునే రకమేకాని, మాటకోసం నిలబడే తత్వమే లేనివాడు.

కాశ్మీర్‌లో కొత్త శకం ప్రారంభమైందని, కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఎక్కువ రోజులు ఉంచబోమని, పరిస్థితులు చక్కబడిన వెంటనే రాష్ట్ర హోదా కల్పిస్తామని ప్రధాని చెప్పారు.జమ్ము కాశ్మీర్, లడఖ్ ప్రారతాల్లో ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని, త్వరలోనే ఎన్నికలు జరుపుతామనీ తెలపడం ఒకరకంగా రాష్ట్రాన్ని విభజించడం, కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయడం జమ్ము కాశ్మీర్ ప్రజలకు ఇష్టంలేదని పరోక్షంగా ఒప్పుకోవడమే కదా! ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం, ఆ రాష్ట్ర హక్కులను, అధికారాలను తగ్గించి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ, చర్చలు జరపకపోవడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. జమ్ము కాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరపదలిస్తే లోక్‌సభతో పాటే నిర్వహించి వుండాలి. లోక్‌సభ అభ్యర్థికి ఓటు వేయడానికి సరిపోయిన శాంతి భద్రతలు అసెంబ్లీ అభ్యర్థికి ఓటెయ్యడానికి చాలదా? రాష్ట్రాన్ని విభజించాలనే దురుద్దేశంతోనే లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. కాబట్టి త్వరలోనే జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామనడమూ మోసపూరితమే! ఇన్నాళ్లూ ఆర్టికల్ 370 కారణంగా కాశ్మీర్ ప్రజలు చాలా నష్టపోయారని, తమ ప్రభుత్వం ఈ ఆర్టికల్ రద్దుతో కాశ్మీర్ ప్రజలకు విముక్తిని కల్గించామని మోడీ చెప్పారు. కాశ్మీరీలు 370 వల్ల నష్టపోయారన్నది వాస్తవం కాదు. గతంలోనూ, ఇప్పుడూ పాలిస్తున్న కేంద్ర ప్రభుత్వాలు దానికి తూట్లు పొడవడం వల్ల నష్టపోయారు. విముక్తి కల్పించడం అన్నది నిజమైతే అక్కడి ప్రజలు సంబరాల్లో మునిగి తేలాలి. కానీ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా వుంది. పవిత్ర బక్రీద్‌నాడు ప్రసిద్ధ జామా మసీదులో ప్రార్థనలను కూడా చేయనివ్వని పరిపాలన సాగుతోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదం పెరగడానికి ఆర్టికల్ 370నే కారణమన్నది మరో పెద్ద అభాండం. ఆర్టికల్ 370 ప్రకారం దేశ రక్షణ, విదేశాంగ వ్యవహారాలూ, కమ్యూనికేషన్లు కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయి. మరి సీమాంతర ఉగ్రవాదంగానీ ఆ రాష్ట్రంలోకి చొరబాటుదార్లు ప్రవేశానికీ బాధ్యత అప్పటి, ఇప్పటి కేంద్ర ప్రభుత్వాలకు లేదా?

జమ్ము కాశ్మీర్, లడఖ్‌లో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలున్నాయని, ఇక ఇక్కడ ఆ ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక రంగంతోపాటు ఈ ప్రాంత కళాకారుల ఉత్పత్తులకు, లడఖ్ సేంద్రీయ ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి మార్కెట్‌ను కల్పిస్తామని చెప్పారు. గతంలో ఇక్కడ సినిమా షూటింగులు జరిగేవని, బాలీవుడ్, తెలుగు, తమిళ చిత్ర సీమలు కాశ్మీర్ వచ్చి సినిమా షూటింగ్‌లు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు ప్రాంతాల్లో కొత్త స్పోర్ట్స్ అకాడమీలు, స్టేడియమ్‌లు రాబోతున్నాయని ప్రధాని చెప్పారు. ఇవన్నీ చెయ్యడానికి ఈ ఆరేళ్ల కాలంలో మోడీని, కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరడ్డుకున్నారు? ఇప్పుడు ప్రజలకు భ్రమలు కల్పించడం తప్ప ఈ మాటల్లో నిజాయితీ లేశ మాత్రమైనా లేదు. కాశ్మీర్‌పై భిన్నాభిప్రాయాలను గౌరవిస్తామని ప్రధాని చెప్పిన సమయానికే రాజ్యసభలో కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్‌ను, సీపీఐ జాతీయ అధ్యక్షుడు రాజా,సీనియర్ నేత ఏల్చూరి సీతారాంలను శ్రీనగర్ విమానాశ్రయం నుండి వెనక్కు పంపారు. వారం రోజులుగా ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు గృహ నిర్బంధంలో మగ్గుతున్నారు. మోడీ ప్రజలకు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని ఇప్పటికే ప్రజలు అర్థం చేసుకున్నారు. తర్వాత పరిస్థితులు ఎలా మారతాయో అంచనా వేయడం కష్టం.

## లడఖ్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేయనున్న ధోనీ



**రాజధాని వార్తలు :** టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి అరుదైన గౌరవం దక్కింది. టెరిటోరియల్ ఆర్మీ గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న మిస్టర్ కూల్.. ఆగస్టు 15న లేహ్‌లో జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.టీమిండియా మాజీ కెప్టెన్ ప్రస్తుతం కశ్మీర్‌లో సైనిక విధులు నిర్వర్తిస్తున్నారు.ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఎంఎస్ ధోనీ ఉన్నారు ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ( జమ్మూకశ్మీర్, లద్దాఖ్)గా విడిపోయింది.

ఆర్టికల్ 370 రద్దుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న క్రమంలో ధోనీకి అరుదైన గౌరవం దక్కింది.లడఖ్ ప్రాంతంలోని లేహ్ మంచుకొండల్లో ఆగస్టు 15న ధోనీ జాతీయ జెండా ఎగరవేయబోతున్నారు.ప్రస్తుతం పుల్వామాలో విధులు నిర్వహిస్తున్న ధోని.. తన బెటాలియన్‌తో కలిసి త్వరలోనే లేహ్‌కు వెళ్లనున్నారు ఆగస్టు 15 వరకు తన బెటాలియన్‌తో కలిసి ఆయన అక్కడ ఉంటారు.ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ నివురు గప్పిన నిప్పులా ఉంది. అలాంటి పరిస్థితుల్లోనూ ఆయన సైనిక విధులు నిర్వర్తిస్తున్నారు.

## 'బిగ్‌బాస్-3'పై ఏపీ హైకోర్టులో పిల్ దాఖలు

**రాజధాని వార్తలు, అమరావతి :** ఓ టీవీ ఛానల్లో ప్రసారమవుతున్న 'బిగ్‌బాస్-3' రియాల్టీ షో కార్యక్రమంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. అశ్లీలత, అసభ్యత, హింసను ప్రోత్సహించేదిగా ఆ షో ఉందని పేర్కొంటూ తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కార్యక్రమాన్ని సెన్సార్ చేయకుండా ప్రసారం చేయడం వల్ల యువత, చిన్నారులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో జరిగిన వేధింపులపై ఇద్దరు యువతులు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని బిగ్‌బాస్ 3 ప్రసారాన్ని నిలువరించేలా ఆదేశించాలని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఫిల్మ్ సర్టిఫికేషన్ సెంట్రల్ బోర్డు ఛైర్‌పర్సన్, ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ ఫౌండేషన్, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితరులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

## రోగాలు వస్తాయి జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

కలుగుతోంది. కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్టు అనిపించడం, నోరు ఎండిపోయి అధిక దాహం లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి.

**నివారణకు ఈ జాగ్రత్తలు అవసరం..**

డెంగ్యూ వ్యాధిని కలిగించే ఏడిస్ దోమలు నిల్వవున్న నీటిలో పెరుగుతాయి. ఇంటి ఆవరణలో పగిలిన సీసాలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ డబ్బాలు, కుండీలలో నీరు నీల్వ లేకుండా చూసుకోవాలి. వ్యాధి లక్షణాలు కనిపిం చినట్టయితే ఆస్పిరిన్, బ్రూఫిన్, కాంబీస్లామ్ వంటి మాత్రలు వాడకూడదు. ఈ సమయంలో అటువంటి మాత్రలు వాడినట్లు అయితే వ్యాధి తగ్గకపోగా ఉధృతమయ్యే అవకాశం ఉంది. ఇటు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి మౌనిక అన్నారు.

# మైనార్టీల త్యాగం..

**స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తమ కుంటుంబాలను, శక్తి,యుక్తులను దేశం కోసం వెచ్చించిన దేశభక్తులకు నేడు గుర్తింపు,గౌరవం లేకుండా పోయాయి. అంతకంటే దారుణవిషయమేమంటే వారి వారసులను నేటి ప్రభుత్వాలు దేశద్రోహులుగా ముద్రవేస్తున్నాయి.. ఆనాడు బ్రిటీష్ ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేసి,వారి తొత్తులుగా ఉంటూ కుట్రలు, కుయుక్తులతో అధికారం చేజిక్కించుకొన్న రాజకీయ నేతల వారసులు తామే దేశభక్తులుగా చెలామణి అవుతున్నారు. అప్పటి మైనార్టీలు, దేశభక్తుల త్యాగం .. ధూర్తుల భోజ్యంగా మారింది. ఇంతకంటే దారుణమైన విషయం ఏమన్నా ఉందా ?**

**ఉప్పుసత్యాగ్రహంలో థరేవ్‌తుండియిల్లా టైటస్**

కేరళలోని మరమన్ లాగే స్వాతంత్ర్య సమరయోధుల పోరాట చరిత్రలో ప్రముఖుడు థరేవ్‌తుండియిల్లా టైటస్. 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గాంధీజీ సబర్మతీ ఆశ్రమంలో కార్యనిర్వాహవర్గ కార్యదర్శిగా పనిచేశారు. గాంధీజీ ఆయనను టైటస్‌జీ అని ప్రేమగా పిలుచుకునే వారు. స్వాతంత్ర్యోధ్యమంలో ఆయన సేవలకు గాను నాటి 500 నోట్లపై దండిమార్చిలో పాల్గొన్న వారిలో ఆయన ఫోటోను కూడా భారత ప్రభుత్వం ప్రచురించింది. **అలాంటివారి చరిత్రను పుటల నుంచి తొలగించడానికి బీజేపీప్రభుత్వం ఆ నోట్లను రద్దు చేసింది.**

**దండిలో పాల్గొని జైలుపాలైన పాల్ రామస్వామి**

ఈయన కూడా స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన వారు. దండి సత్యాగ్రహంలో పాల్గొన్న ఆయనను బ్రిటీషు ప్రభుత్వం తిరుచిరాపల్లి జైల్లో పెట్టింది. అప్పటికి ఆయన బిషప్ హార్బెట్ కాలేజీలో విద్యార్థి.

**స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన బ్రహ్మదేవ్ బట్టాచార్య**

స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడమే కాకుండా 'సంధ్య' అనే పత్రికకు ఎడిటర్‌గా పనిచేశారు. దీంతో దేశ ప్రజ ల్లో స్వాతంత్ర్య కాంక్షను పెల్లుబికేలా చేశారు. ఈయన బ్రాహ్మణుడైనప్పటికీ క్రైస్తవత్వాన్ని స్వీకరించారు.

**దేశద్రోహం కేసులో జైలుకెళ్లిన కాళీ చరణ్ బెనర్జీ**

బెంగాల్‌కు చెందిన ఆయన ప్రసిద్ధ లాయర్ కాంగ్రెస్ ఉండి అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. వేదాంత పరమై న క్రిస్టియన్ ఫిలాసఫీని, వేతాంతపరమైన తోమిజంను వ్యాప్తి చేశారు. ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసిన బ్రిటీషు ప్రభుత్వం కోల్‌కత్తాలో ఖైదు చేసింది.

**ట్రావన్ కోర్ ఝాన్సీలక్ష్మీబాయ్ అక్కమ్మ చెరియన్**

ఈమెను అందరూ ట్రావన్‌కోర్ ఝాన్సీ లక్ష్మీ బాయ్ అనేవారు. టీచరు ఉద్యోగానికి రాజీనామా చేసి ఆమె స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. తంపనూర్ నుంచి ప్యాలెస్ ఆఫ్ మహారాజ చితిర వరకు చేపట్టిన ర్యాలీతో తిరునల్ బలరామ వర్మ ఆగ్రహం చెంది రాష్ట్ర కాంగ్రెస్‌పై నిషేధం విధించారు. ఆవిడ జీవిత విశేషాలను ఒరు సమరం (అక్కమ్మ చెరియన్ ఆటోబయోగ్రఫీ లైఫ్ ఈజ్ ఎ స్ట్రగుల్ ఆటోబయోగ్రఫీ ) చదవవచ్చు. ఆమె ధైర్యసాహసాలను విన్న గాంధీజీ ట్రావన్‌కోర్ ఝాన్సీ రాణి అనేవారు. బ్రిటీషు ప్రభుత్వం జారీ చేసిన నిషేధాజ్ఞల ఉత్తర్వులను ఉల్లంఘించి నందుకు 1939లో ఆమెను అరెస్టు చేశారు.



అక్కమ్మ



షేక్ బికారి



మౌలానా



మీర్ నిసార్ అలీ

**క్రైస్తవులకు భాగస్వామ్యం**

కుమారప్ప పేరుమోసిన కాంగ్రెస్ వాది, సత్యాగ్రహానికి బలమైన మద్దతు దారుడు, ఆయనే జాతీయోద్యమంలో క్రిస్టియన్లకు భాగస్వామ్యం కల్పించారు. మహాత్మాగాంధీ నడిపిన వారపత్రిక 'యంగ్ ఇండియా' కు ఆయన వ్యాసాలు రాసేవారు. తదనంతరం ఆయన ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన రాసిన వ్యాసాలతో ఆయనకు ఏడాదిన్నర జైలు శిక్ష విధించారు. అయితే ఆయన రెండు రోజుల్లోనే విడుదల అయ్యారు. కారణం గాంధీ-ఇర్విన్‌ల ఒడంబడిక..క్విట్ ఇండియా ఉద్యమంలో ఆయన రహస్య కార్యకలాపాల్లో పాల్గొన్నారు. దీంతో ఆయనను అరెస్టు చేయగా, కోర్టు రెండున్నరేళ్ల కఠినకారాగార శిక్ష విధించి జబల్‌పూర్ కేంద్ర కారాగారానికి పంపారు. ఆయన 1945 వరకు అక్కడే ఉన్నారు. 1947 జూలైలో లండన్‌లో జరిగిన భారతీయ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనారు. కాంగ్రెస్‌లో ప్రముఖ నాయకుడిగా ఎదిగిన ఆయన ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ సభ్యుడిగా జయప్రకాష్ నారాయణ్ 'స్థానే' అవకాశం వచ్చినా ఆయన తిరస్కరించారు. ఇలా ఎందరో మహాను భావులు కులాలకు మతాలకు అతీతంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. విద్యార్థి నాయకుడిగా జోఅచ్చిమ్ ఆల్వా స్వాతంత్ర్యానికి అసాధారణ త్యాగాలు చేశాడు. ప్రపంచ మానవులంతా ఒక్కటే అని సహజీవనం మంచిదని తెలిపాడు. చార్లీస్ ప్రీర్ ఆంర్డూస్ ఇంగ్లాడు చర్చిమత బోధకుడిగా ఉంటూ గాంధీ మహాత్ముడిని దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చేట్లు చేయడమే కాకుండా ఆయనకు సన్నిహిత స్నేహితుడిగా ఉన్నాడు. ఆయన విద్యావేత్త..సంఘసంస్కర్త కూడా..జార్జి జోసెఫ్ మొదటి బ్యాచ్ బారిస్టర్ పట్టా పుచ్చుకున్న వారిలో ఒకరు. సహాయ నిరాకరణలో ఆయన జైలు కెళ్లారు.

**రాజ్యసంక్రమణపై రణభేరి షేక్ బికారి**

సామ్రాజ్యవిస్తరణ కోసం రాజ్యసంక్రమ బిల్లును ప్రవేశపెట్టిన జనరల్ డల్హౌసీ ప్రభుత్వంపై రణభేరిని సాగించిన వీరుడు షేక్ బికారి సాహెబ్..ఆంగ్లేయుల చర్యలపై అసంతృప్తితో ఉన్న స్వదేశీ పాలకులను సమైఖ్యపరచి రాయగఢ్‌లోని ఆంగ్లేయుల సైనిక స్థావరాలపై దాడి చేసి విజయం సాధించారు. ప్రతీకారంగా ఈస్టు ఇండియా కంపెనీలు రాంగఢ్ చేరుకొని భీకర యుద్ధాన్ని చేశాయి. బికారి బృందం వద్ద ఆయుధాలు అయిపోవడంతో వడిసెల, బాణాలతో యుద్ధం చేశారు. స్వదేశీయుల ధనకాంక్షను తెలుసుకున్న బ్రిటీషు అధికారులు వారిని లోబరచుకొని బికారీ స్థావరం తెలుసుకొని 1858లో ఆయనను పట్టుకొని విచారణలేకుండా చెట్టుకు ఉరితీశారు. కమాండెంట్ మెక్‌డోనాల్డ్ ఆయన్ను గురించి రాస్తూ షేక్ బికారీ తిరుగుబాటు దారులందరిలోనూ ప్రమాదకారి అని పేర్కొన్నాడు. దీన్ని బట్టే ఆయనకు బ్రిటీషు సైన్యం ఎంతగా భయపడిందో తెలుస్తోంది.

**జాతిని ఏకం చేసిన మీర్ నిసార్ అలీ**

పశ్చిమ బెంగాల్‌లోని నర్కేల్ బరియాలో సన్నకారు రైతు కుటుంబంలో జన్మించిన మీర్ నిసార్ అలీ (టిటు మీర్) చిన్నతనంలో వస్తాదుగా పేరుపొందారు. నర్కేల్ బరియాలోని హైదర్‌పూర్‌లో ఆయన ధార్మిక బోధనలు చేస్తుండేవారు. ఆకాలంలోనే ఈస్టిండియా అధికారులు జమీందారీలు, పెద్దలు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలు,దోపిడీని ప్రత్యక్షంగా చూసి వారి ఆక్రందనలకు చలించారు. ధార్మిక కార్యక్రమాలతోపాటు ప్రాపంచిక సమస్యల పరిష్కారానికి ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. జమీందారీలకు మద్దతుగా నిలుస్తున్న ఆంగ్లేయుల బలగాలను సాయుధంగా ఎదుర్కొన్నారు. టిటూ మీర్ సాహస కార్యాలద్వారా కులమతాలకు అతీతంగా వేలసంఖ్యలో ప్రజలు ఆయన వెంట నడిచారు. 1831 నవంబరు 19న బ్రిటీషు సైనికులు నర్కేల్ బరిలోని కోటను ముట్టడించగా శత్రువులతో పోరాడుతూ, గాయపడి కుప్పకూలిన సయ్యద్ మీర్ నిసార్ అలీ చికిత్సపొందుతూ 1832లో మృతి చెందారు.

**మాతృభూమికోసం ప్రాణాలర్పించిన మౌలానా**

మాతృభూమి కోసం వ్యక్తి బలికావడం ఆవ్యక్తికి ఆ భూమిపై ఉన్న మమకారానికి గుర్తు. మౌలానా పీర్ అలీఖాన్ 1820లో జ్ఞాతతృష్ణతో ఇల్లువదలి, అరబిక్,పర్షియన్ ఉర్దూ, భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న స్థానిక విప్లవకారులతో కలసి పోరాడారు. ఆయన బీహార్‌లోని ధనాపూర్‌లో ఆంగ్లేయుల సైనిక స్థావరంపై దాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన సైనికులు 1857జూలై 4న అరెస్టు చేశారు. దీన్నే 'పాట్నా కుట్ర కేసు' అంటారు. బ్రిటీషు ప్రభుత్వం ఆయన్ను చిత్ర హింసలకు గురిచేసింది. అయినా మొక్కవోని ధైర్యంతో ఆయన ఇలాచెప్పారు. బలమైన స్వేచ్ఛాకాంక్షతో స్వాతంత్ర్యం కోసం రక్షతర్పణం సిద్ధమవుతున్న ఈ పుడమి పుత్రులు నిలువరించడం మీవల్ల కాదన్నాడు.. మా రక్త బిందువులతో ప్రజల్లో వేడిపుడుతుంది. వాటిలో మరు మాడి మసైపోవడం ఖాయం అని చెప్పాడు. దీంతో ఆయన చేతులకు,కాళ్లకు బిగుతైన బేడీలు వేసి బ్రిటీషు సైనికులు పైశాచిక ఆనందం పొందారు. 1857 జైలై 7న ఉరికొయ్యపై చిరునవ్వుతో వేలాడుతూ మృత్యువును ఆహ్వానించాడు.

స్వాతంత్ర్య కాంక్షను పెంచిన హాజీ, స్వదేశంలోని ప్రజలను దౌర్జన్యాల నుంచి రక్షించాలని ఈస్టిండియా కంపెనీ బలగాలపై శంఖారావం పూరించిన యోధుడు మీర్ ఖాశిం అలీ ఖాన్, అత్యున్నత రాకెట్ ఆయుధాలతో తిరగబడ్డ టిపూ సుల్తాన్ , ఇంకా ఎందరో ప్రముఖులు ఈ దేశాన్ని దాస్యవిముక్తికి ప్రాణార్పణం చేశారు.

**- ఖాన్**

# మీసేవా కేంద్ర్రాలకు చెల్లు

మీ సేవ
సులభంగా, వేగంగా

**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీలో అక్టోబర్ 2న గాంధీ జయంతి నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న గ్రామ సచివాలయాల రాకతో పాలనలో పెను మార్పులు రానున్నాయి. ఏపీ సచివాలయం తరహాలో ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందాలన్న లక్ష్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇప్పటివరకూ ఈ సేవలను అందించిన మీ-సేవ కేంద్రాలు మూతపడే అవకాశముంది. దీనిపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటించనుంది. ఏపీలో రేషన్ దుకాణాల తరహాలోనే మీ- సేవ కేంద్రాలకు ఇక కాలం చెల్లినట్లేనా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గ్రామ సచివాలయాల రాకతో ప్రభుత్వ సేవలన్నీ ఇకపై ఏకీక ృతం కానున్నాయి. ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో లబ్దిదారులకు అందించే డబ్బులు, ధృవపత్రాలు, అనుమతుల జారీ, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు వంటి దాదాపు 367 రకాల ప్రభుత్వ సేవలు, 30కి పైగా ప్రైవేటు సేవలు ఇప్పటివరకూ మీ సేవ కేంద్రాల్లో లభిస్తున్నాయి. వీటిలో కరెంటు బిల్లులు, బీఎస్ఎన్ఎల్ ఫోన్ బిల్లులు, ఇతరత్రా బిల్లు చెల్లింపులను కూడా మీ సేవ కేంద్రాల్లో అనుమతిస్తున్నారు. ఓటరు కార్డుల జారీ, పాసుబుక్కుల జారీ వంటి సేవలు కూడా మీ సేవల్లో అందుబాటులో ఉంచారు. కానీ మారుతున్న పరిస్థితులను ద ృష్టిలో ఉంచుకుని వీటితో పాటు పదుల సంఖ్యలో పుట్టుకొచ్చిన ప్రభుత్వ పథకాల వర్తింపు, రేషన్ పంపిణీ, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి ప్రభుత్వ ప్రాధాన్య సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తెస్తున్నారు దీంతో ఇప్పటివరకూ ఆయా సేవలకు కేంద్రంగా ఉన్న మీ సేవ సెంటర్లు మూతపడక తప్పని పరిస్థితి రానుంది.

మీ సేవ సెంటర్ల వల్ల ప్రభుత్వ సేవలు నామమాత్రపు రుసుముతో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇందులో తగినంత మంది సిబ్బంది మీ సేవ సెంటర్ల వల్ల ప్రభుత్వ సేవలు నామమాత్రపు రుసుముతో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇందులో తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడం, కాంట్రాక్టు తీసుకున్న వారు సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితులు లేకపోవడంతో అవి నాసిరకంగా తయారయ్యాయి. దీంతో మీ సేవ సెంటర్లకు వెళ్తున్న ప్రజలకు నిరాశ తప్పడం లేదు. దీన్ని గమనించిన ప్రభుత్వం.. మీ సేవకు అనుమతిచ్చిన సేవలను గ్రామ సచివాలయాలకు బదిలీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల ఏర్పాటు వల్ల ఆయా ప్రాంతాల్లో మీ సేవ కేంద్రాలు తొలి దశలో మూతపడే అవకాశముంది. ఈ విధానం విజయవంతమైతే భవిష్యత్తులో పట్టణాలు, నగరాల్లో ఉన్న మీ సేవ కేంద్రాలకూ దీన్నే వర్తింపచేస్తారు.

గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల రూపంలో 4 లక్షల మంది ఉద్యోగులను తీసుకుంటున్న సర్కారు... ప్రభుత్వ సేవలను ఒకే చోట అందుబాటులో ఉంచడం ద్వారా ప్రజల ఆదరణ చూరగొనాలనే ఆశయం పెట్టుకుంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. దశాబ్దానికి పైగా సేవలందిస్తున్న మీ సేవ కేంద్రాల మూత అంత సులువు కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 9 వేల మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ ఉన్నాయి. మీ సేవ కేంద్రాల మూసివేతకు ప్రభుత్వం సిద్దమైతే అందులో పని చేస్తున్న సిబ్బంది రేషన్ డీలర్ల తరహాలోనే రోడ్డెక్కే అవకాశముంది. వీరికి ప్రభుత్వం ఎలాంటి ప్రత్యామ్నాయం చూపుతుందో చూడాలి.

## కశ్మీర్ గవర్నర్‌గా విజయకుమార్

(మొదటిపేజీ తరువాయి)

ఎంతోమంది నేరస్థులను ఎన్‌కౌంటర్ చేశారు. 2008లో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ చీఫ్‌గా నియమితులయ్యారు. 2010నాటి దంతెవాడ ఘటన తర్వాత విజయ్ కుమార్ సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా 2010-2012 మధ్య కాలంలో మావోయిస్టుల ఏరివేత, అటు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఆటకట్టించడంలో కీలక పాత్ర పోషించారు. 2018లో కశ్మీర్ గవర్నర్‌కు భద్రతా వ్యవహారాల సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు.

ఆయనకు హైదరాబాద్ నగరంతో కూడా ఆయనకు మంచి సంబంధాలున్నాయి. గతంలో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి అధిపతిగా పనిచేశారు. ఆ తర్వాత డీజీ, సీఆర్పీఎఫ్ డీజీగా పనిచేసి పదవీ విరమణ అయ్యారు. ఆ తర్వాత కూడా వామపక్ష తీవ్రవాద ప్రాంతాలకు హోం మంత్రిత్వ శాఖకు సీనియర్ సలహాదారుగా పనిచేశారు. ప్రస్తుతం, హోమ్, ఫారెస్ట్, ఎకాలజీ, ఎన్విరాన్మెంట్, హెల్త్ , మెడికల్ ఎడ్యుకేషన్, యూత్ సర్వీసెస్, స్పోర్ట్స్, హాస్పిటాలిటీ, ప్రోటోకాల్, సివిల్ ఏవియేషన్, ఎస్టేట్స్, ఇనార్మేషన్ పోర్ట్‌ఫోలియోలతో జమ్ముకశ్మీర్ గవర్నర్‌కు సలహాదారుగా ఉన్నారు. అందుకే ఇంతటి రికార్డ్ ఉన్న విజయ్‌ను కశ్మీర్‌కు పంపితే సమర్థవంతంగా చూసుకుంటారని కేంద్రం భావిస్తోంది.

**ఇదిలావుండగా..**

తెలంగాణ గవర్నర్‌గా ఉన్న ఈఎస్ఎల్ నరసింహన్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పంపుతారంటూ ప్రచారం కూడా జరిగిన విషయం తెలిసిందే. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు మిత్రుడు కావడంతో నరసింహన్ పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే, తాజాగా నరసింహన్ కాకుండా విజయ్ కుమార్ పేరు తెరపైకి వచ్చింది.

## మా ప్రభుత్వం ఆ విషయం స్పష్టం చేసింది : సీఎం జగన్




**రాజధాని వార్తలు, అమరావతి :** ఏ శంకుస్థాపన రాయి కూడా పరిశ్రమగా మెరవకుండా వదిలిపెట్టే ప్రసక్తేలేదని తమ ప్రభుత్వం నిజాయితీగా, చిత్తశు ద్ధితో స్పష్టం చేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ట్విటర్ వేదికగా ఆయన స్పందించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికోసం చేస్తున్న కృషికి సహకరిస్తున్న విదేశీ వ్యవహారాలశాఖకు, డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ సదస్సులో పాల్గొన్న ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

కాగా పలు కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ పేరిట ఓ సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సదస్సులో యూఎస్ఏ, యూకే, జపాన్, కెనడా, కొరియా, సింగపూర్, ఆస్ట్రియా, పోలాండ్, ఆస్ట్రేలియా, టర్కీ తదితర 35 దేశాల రాయబారులు, హైకమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరస్పరం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించుకునే దిశగా పలు ఒప్పందాలు కుదుర్చుకోవటమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.

## ఈ నెల 14నుంచి మంగళగిరిలో 'జనసేన' సమావేశాలు

**రాజధాని వార్తలు, మంగళగిరి :** ఈ నెల 14వ తేదీ నుంచి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమావేశాలు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 'జనసేన' కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఓ ప్రకటన వెలువడింది. 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఏలూరు పార్లమెంట్ పరిధి, 16వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ పార్లమెంట్ పరిధి, మధ్యాహ్నం మూడు గంటలకు మచిలీపట్నం పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధులలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు జరుగుతాయని పేర్కొంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని 'జనసేన' కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తారని తెలిపింది.

## ఆగస్టు 15 వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆగస్టు 15 పరేడ్ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఏపీ రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగానే ఉన్నామని చెప్పారు. ఏపీకి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా భద్రత విషయంలో రాజీపడబోవడంలేదని స్పష్టం చేశారు.

# అన్నా.. నీ అనురాగం



మతాలకు కులాలకు అతీతంగా ప్రజలంతా జరుపుకునే పండుగ రాఖీ పండుగ. 'రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను ఇప్పుడు దేశమంతా జరుపుతున్నారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం.

రక్షాబంధన్‌కు ప్రాతిపదిక ద్రౌపది –శ్రీకృష్ణుడు, అలెగ్జాండర్ – పురుషోత్తముడి భార్య,మహావిష్ణువు – బలిచక్రవర్తి

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడికి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆ రోజు రావణ పౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరుల ను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షా బంధన్‌ను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం.. నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.

ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది, శ్రీకృష్ణుడి కి అన్నాచెల్లెల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడి ని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలుకు రక్తం ధారగా కారుతుందట. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలికి కట్టు కట్టిందట. దానికి క ృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీకృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు.

**మహావిష్ణువు – బలిచక్రవర్తి**

శ్రీ మహావిష్ణువు బలి చక్రవర్తి కోరిక మేరకు అతనితోపాటు పాతాళంలో ఉండిపోతాడు. శ్రీమహాలక్ష్మి వెళ్లి బలిచక్రవర్తికి రక్షాబంధంకట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకొనిపోతుంది. అందుకే రక్షాబంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడింది.

**అలెగ్జాండర్ భార్య, పురుషోత్తముడి కథ**

గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. గొప్పవైభవంతో తలతూగుతున్న భారత్‌ను జయించడం అలెగ్జాండర్ లక్ష్యంగా పెట్టుకుంటాడు. దీంతో పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. యుద్ధం హోరాహోరీ జరుగుతుంది. అనుకున్నంత తేలిగ్గా జయించడం కుదరదని అలెగ్జాండర్ భావిస్తారు. అయితే పురుషోత్తముడి ధైర్యసాహసాలు అలెగ్జాండర్‌ను ఆకట్టుకుంటాయి. అదే సమయంలో రాఖీపూర్ణిమ సందర్భంగా పురుషోత్తముడి భార్య అలెగ్జాండర్‌కు రాఖీ కడుతుంది. అలెగ్జాండర్ ఆమెను చెల్లిగా భావించి యుద్ధాన్ని విరమింపచేస్తాడు.

**హయగ్రీవావతారం**


శ్రీ మహావిష్ణువు విజయగాథా పరంపరలలో హయగ్రీవావతారంలో జరిగిన విజయం కూడా విశేషంగా చెబుతారు. పూర్వం ఓసారి హయగ్రీవుడు అనే ఓ రాక్షసుడు దేవిని గురించి తీవ్రంగా తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చిన దేవి వరం కోరుకొమ్మన్నప్పుడు తనకు మరణం లేకుండా చూడమన్నాడు. అయితే అది ఆమె సాధ్యపడదని చెప్పినప్పుడు హయగ్రీవం (గుర్రపు తల) ఉన్నవాడి చేతిలో మాత్రమే తనకు మరణం వచ్చేలా అనుగ్రహించమన్నాడు. ఆమె ఆ రాక్షసుడిని అనుగ్రహించి అంతర్థానమైంది. ఆ వరంతో ఆ రాక్షసుడు దేవతలను ముప్పతిప్పలు పెడుతుండేవాడు. విష్ణుమూర్తి ఆ రాక్షసుడిని యుద్ధంలో నిరంతరం ఎదిరిస్తున్నా ఫలితం లేకపోయింది. చివరకు శివుడు ఓ ఉపాయాన్ని పన్నాడు. శ్రీ మహావిష్ణువు ధనుస్సుకు బాణాన్ని సంధించి ఉంచి విపరీతమైన అలసట కలిగి అగ్రభాగాన వాలి నిద్రపోయాడు. ఆయనను నిద్రలేపటానికి దేవతలెవరికీ ధైర్యం చాలలేదు. అయితే ఆ దేవతలంతా ఓ ఆలోచనకు వచ్చి వమ్రి అనే ఓ కీటకాన్ని పంపి ధనుస్సుకున్న అల్లెతాడును కొరకమని చెప్పారు. అలా చేస్తే తాడు వదులై విల్లు కదలి విష్ణువుకు మెలకువ వస్తుందన్నది వారి ఆలోచన. అయితే ఆ పురుగు తాడును కొరకగానే దేవతలు ఊహించని విధంగా వింటికి ఉన్న బాణం విష్ణువు మెడకు తగిలి ఆ దెబ్బకు విష్ణువు తల ఎటో ఎగిరి వెళ్ళింది. దేవతలు అంతటా వెదికారు కానీ ఆ తల కనిపించలేదు. బ్రహ్మదేవుడు వెంటనే దేవిని గురించి తపస్సు చేశాడు. అప్పుడామె ప్రత్యక్షమై ఒక గుర్రపు తలను తెచ్చి విష్ణుమూర్తి శరీరానికి అతికించమని చెప్పింది. దేవతలు అలాగే చేశారు. ఆ హయగ్రీవం అతికిన విష్ణుమూర్తిలో మళ్ళీ జీవం వచ్చి లేచాడు. ఆ లేచిన రోజే శ్రావణ పూర్ణిమ. ఆ తర్వాత హయగ్రీవుడుగా మారిన విష్ణుమూర్తి రాక్షసుడిని సులభంగా జయించాడు. దేవీ శక్తి మహిమను, శ్రీ మహావిష్ణు తత్వాన్ని ఈ కథ తెలియచెప్తుంది. అందుకే శ్రావణ పూర్ణిమ నాడు హయగ్రీవ జయంతి కూడా జరపడం కనిపిస్తుంది.

## 'అధికరణ 370 రద్దు అప్రజాస్వామ్యం'



**రాజధాని వార్తలు, తుళ్ళూరు :** కశ్మీరు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన తీరు అప్రజాస్వామికంగా ఉందని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. ఆర్టికల్ 370ను రద్దులో భాజపా ఏకపక్షంగా వ్యవహరించిదని వారు చెప్పారు. దాన్ని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకిస్తున్నారంటూ సీపీఐ తాడికొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పచ్చల సాంబశివరావు తెలిపారు. ఎవరితోనూ చర్చించకుండా, సలహాలు,సంప్రదింపులు చేపట్టకుండా పార్లమెంట్‌లో మెజార్టీ ఉంది కదా అని నియంతగా వ్యవహరిం రేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, ఏఐటీయూసీ కార్యదర్శి జీవీరాజు, సీపీఎం నాయకులు ఎం. రవి, గద్దం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గోవుల మృతిపై విచారణ జరిపిస్తాం : మోపిదేవి




**రాజధాని వార్తలు, విజయవాడ :** నగర శివారులోని కొత్తూరుతాడేపల్లి గోశాలలోని గోవుల మృతిపై శాఖపరంగా విచారణ జరిపిస్తామని పశు సంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారీ సంఖ్యలో గోవులు మృతి చెందడం బాధాకరమన్నారు. విచారణ నివేదిక రాగానే గోవుల మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని గోశాలల్లో ఉన్న గోవుల పరిస్థితిపై తనిఖీలు చేపడతామని చెప్పారు. గోవుల మృతి వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా..? అని కూడా విచారిస్తామన్నారు.

## అశ్రునయనాలతో 'మల్లెల' అంత్యక్రియలు



**రాజధాని వార్తలు, ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం పారిశ్రామిక అభివృద్ధి కారకుడు, మాజీ సర్పంచి మల్లెలఅనంతపద్మ నాభరావు (93) ప్రజల అశ్రునయానాల మధ్య జరిగాయి. పేద ప్రజల ఇండ్లస్థలాల నిమిత్తం కేటాయించిన 70 ఎకరాల భూముల్లో ఆయన అంత్య క్రియల నిమిత్తం జిల్లాకలెక్టర్ 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. కేటాయించిన స్థలంలో పద్మనాభరావు దహన సంస్కారాలు నిర్వహించారు. కుమార్డుమల్లెల శ్రీనివాసచౌదరి చితికినిప్పటించారు. తొలుతపెర్రిలోని ఆయన నివాసం నుంచి జరిగిన అంత్యక్రియలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు,కుటుంబ సభ్యులు, ప్రజలు,ఎన్టీటీపీఎస్ కార్మికులు హాజరయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని) మైలవరం శాసన సభ్యుడు వసంతవెంకటకృష్ణప్రసాద్‌లు పాడెనుభుజంపై మోస్తూ అంతిమ యాత్రలో ముందుకు సాగారు. తేదేపా నాయకులు జంపాల సీతారామయ్య, గొర్నేని జగన్‌మోహనరావు (అలీబాబా), తేదేపా మండల అద్యక్షుడురామినేని రాజశేఖర్, మాజీ మండలాద్యక్షుడు జోగిమోహనరావు, జోగిరాము, అంకమోహనరావు, ఎంపీడీవో సుశీల తదితరులు అంత్రక్రియల్లో పాల్గొన్నారు.

## బాషా సేవలు మరచిన తెలుగుదేశం పార్టీ



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రుల అభిమాన నటుడు ఎన్టీ రామారావు తెలుగు దేశం పార్టీని ప్రారంభించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరి అనేక విధాలుగా సేవలందించిన లాల్ జాన్ బాషాను టీడీపీ విస్మరించింది. 2013 ఆగస్టు 15న జెండా వందనం కోసం హైదరాబాద్ నుంచి గుంటూరుకు వస్తూ.. కారు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయిన ఆయన కుటుంబాన్ని తెలుగుదేశం పూర్తిగా పక్కన పెట్టింది. మరో కారు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రం నాయుడు కుమారుడు కింజరపు రామమూర్తినాయుడు రాజకీయాల్లోకి వచ్చి ఎంపీగా కొనసాగుతున్నాడు.. ఆయన మృతితోనే పార్టీలోకి వచ్చిన సోదరుడు కింజరపు అచ్చెన్నాయుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు... అయితే సీఎం చంద్రబాబు మాత్రం బాషా కుటుంబానికి ఏమాత్రం సానుభూతి కూడా చూపడం లేదని మైనార్టీలు వాపోతున్నారు. ఇప్పటికైనా బాషా కుటుంబానికి చేయూత నిస్తూ ఆకుటుంబంలోని వారికి పార్టీలో సముచిత ప్రాధాన్యం, ప్రాతినిధ్యం ఇవ్వాలని ముస్లిం వర్గం కోరుతోంది.

## విద్యార్థులకు ఏపీ సర్కారు తీపి కబురు



**బస్ పాస్‌లకు కిలోమీటర్ల పరిధి పెంపు**

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురందించింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల రాయితీ బస్ పాస్ పరిధి పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు ఉన్న 35 కిలోమీటర్ల పరిమితిని 50 కిలో మీటర్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 35 కిలోమీటర్ల పరిధితో రాష్ట్రంలోని విద్యార్థులు ఇప్పటివరకు నానా అగచాట్లు పడుతున్నారు. రాష్ట్రంలో అధిక శాతం విద్యాసంస్థలు నగర శివార్లలో ఉండటంతో విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాల, కళాశాలకు వెళ్లాలంటే 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉంటోంది.

ఈ కారణంగా రాయితీ బస్ పాస్‌లకు అర్హత కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో 660 విద్యాసంస్థలు 35 కిలోమీటర్ల కంటే అధిక దూరంలో ఉన్నట్లు ప్రభుత్వం నిర్ధారించింది. దీంతో రాయితీ బస్‌పాస్‌ల కిలోమీటర్ల పరిధి 35 నుంచి 50 కిలోమీటర్లకు పెంచింది. ఈ నిర్ణయంతో 15 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. దీని కారణంగా ప్రభుత్వంపై ఏడాదికి 18.50 కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా. ఆర్టీసీ అందించే అన్ని రకాల బస్ పాస్‌లకు ప్రభుత్వం సంస్థకు వంద శాతం నిధుల్ని రీయింబర్స్ చేస్తుంది. ఈ బస్ పాస్‌లకుగాను ఏటా రూ.290 కోట్ల మేర ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోంది.

## తదుపరి ఎన్నికలకు సిద్ధమవుతున్న భాజపా!



**దిల్లీ :** త్వరలో జరగబోయే నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు భాజపా సిద్ధమవుతోంది. అందులో భాగంగా హరియాణా, దిల్లీ, మహారాష్ట్రలో ఎన్నికల ఇన్‌ఛార్జిలను నియమించింది. దిల్లీ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కేంద్రమంత్రి ప్రకాశ్ జావదేకర్, హరియాణాకు కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్, మహారాష్ట్రకు పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. అలాగే ఝార్ఖండ్ ఎన్నికల బాధ్యతల్ని పార్టీ ఉపాధ్యక్షుడు ఓపీ మాథుర్‌కు అప్పగించారు. హరియాణా, మహారాష్ట్ర, ఝార?ండ్‌లలో ఈ ఏడాది చివర్లో, దిల్లీలో 2020లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. దిల్లీ తప్ప మిగిలిన మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం భాజపా అధికారంలో ఉంది. వీటిని నిలబెట్టుకుంటూనే దిల్లీలోనూ ఈసారి పార్టీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే అనుభవమున్న నాయకులను ఎన్నికల బాధ్యులుగా నియమించినట్లు తెలుస్తోంది.


# బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

**షాప్స్**

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

రాజధాని వార్తలు ప్రకటనల కొరకు సంప్రదించండి
అమరావతి : 94406 62699
మంగళగిరి : 98480 89624
విజయవాడ : 92461 69069
గుంటూరు : 90302 98283

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

సాగర్ బోర్ వెల్స్
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీర్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

**హోటల్స్**

రాయపూడి
కాకతీయ పుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హెూమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**హస్పటల్స్**

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రానుంది.
-9440662699

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101


విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**యూనివర్సిటీ**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

గుంటూరు టోబాకో ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించినా యాడ్లపాటి రఘునాథబాబు

## రైతులకు రూ.3వేల పింఛన్...



**రాజధాని వార్తలు, అమరావతి :** గత బడ్జెట్‌లో రైతుల కోసం కేంద్రం పింఛన్ పథకం ప్రవేశపెట్టింది. రైతులకు నెలకు రూ.3వేలు అందించే ఈ స్కీమ్ కోసం రిజిస్ట్రేషన్స్ ఇప్పటికే ప్రారంభమ్యాయి. 2019–2020 బడ్జెట్ సమయంలో ప్రధాన మంత్రి కిసాన్ మాన్–ధన్ యోజన పథకాన్నికేంద్ర ప్రకటించింది.కిసాన్ మాన్ ధన్ యోజన పథకం రిజిస్ట్రేషన్స్ శుక్రవారం నుంచే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 18–40 ఏళ్ల వయసున్న రైతులు ఈ పథకానికి అర్హులు.రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 60 ఏళ్లు వయసు రాగానే వారికి నెలకు రూ.3వేల పెన్షన్ అందుతుంది. ఇందుకోసం రైతులు నెలకు రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రైతు ప్రస్తుత వయసు ఆధారంగా ప్రీమియం ఎంత (రూ.55 – 200) చెల్లించాలన్నది నిర్ణయిస్తారు.60 ఏళ్లు నిండిన తర్వాత ఎల్ఐసీ నుంచి రైతులకు ప్రతి నెలా రూ.3వేల పెన్షన్ అందుతుంది.ఒకవేళ సదరు రైతు 60 ఏళ్ల లోపే మరణిస్తే తాను చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా నామినీకి చెల్లిస్తారు.ఒకవేళ రైతు 60 ఏళ్ల తర్వాత పెన్షన్ వస్తుండగా చనిపోతే పెన్షన్‌లో 50శాతం కుటుంబ సభ్యులకు అందుతుందిరిజిస్ట్రేషన్ కోసం ఆయా రాష్ట్రాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. త్వరలో ఆన్‌లైన్ సదుపాయం కూడా అందుబాటులోకి రానుంది.


Cell: 8341418751, 9912356224
e-mail: superprinters2017@gmail.com
సూపర్ ప్రింటర్స్
WEB OFFSET PRINTERS
MULTI COLOUR and B&W PRINTERS
న్యూస్ పేపర్స్ మరియు బుక్స్ సరసమైన ధరలకే ప్రింటింగ్ చేయబడును.



వివరాలకు : మహ్మద్ ఇలియాస్
డోర్ నెం: 2-3-655/సి/118, దుర్గానగర్, అంబర్‌పేట్, హైదరాబాద్ - 500 013. తెలంగాణ రాష్ట్రం









# కాశ్మీర్ ఖైదు




**మతవిద్వేషాన్ని రగిల్చి చలికాచుకుంటున్న పాలక బీజేపీ వికృత రూపం ప్రదర్శిస్తోంది. ప్రజల కనీస అవసరాలు తీర్చకుండా వారి దృష్టిని మరల్చడానికి ఎలాంటి ఘాతుకానికైనా వెనకడుగు వేయడం లేదు. లక్షల కొద్దీ బలగాలను కాశ్మీర్‌లో మోహరించి మానవ హక్కులను హననం చేసింది. దాదాపు 80 లక్షల మంది కాశ్మీరీయులను నాలుగు గోడల మధ్య ఖైదు చేసింది. కేంద్ర ప్రభుత్వం అసత్యాలను ప్రచారం చేసి నిజాలకు సమాధి కడుతోంది. దేశమంతా 73వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటుండగా, భూలోక స్వర్గం కాశ్మీరాన్ని చెరసాలలో బంధించారు. శాంతికి మారు పేరైన కాశ్మీర్ ఎంతో ఇష్టపడి భారత్‌లో చేరినందుకు క్షణం క్షణం నరకం అనుభవిస్తోంది. కట్టుకథలతో ప్రజలను మభ్యపెట్టే బీజేపీ రేపు దేశంలోని ఇతర రాష్ట్రాలను కూడా ఇదే విధంగా వేధించవచ్చు. అందుకే నిజానిజాలు తెలుసుకొండి...**

**భా**రత రాజ్యాంగం లోని 370వ ఆర్టికల్‌కు సంబంధించి అనేక అబద్ధాలు ప్రచారం అవుతున్నాయి. ఆ వివరాలను, వాటికి సంబంధించిన వాస్తవాలను తెలుసుకుందాం.

**అబద్ధం -1 :** ఆర్టికల్ 370 నెహ్రూ-షేక్ అబ్దుల్లాల మధ్య జరిగిన చీకటి ఒప్పందం.

**వాస్తవం :** ఆర్టికల్ 370 రాజ్యాంగం రచనా కాలంలోనే దానిలో పొందుపర్చబడి, రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు నుండి, అంటే 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది.

**అబద్ధం -2 :** భారత దేశంలోని ఏ రాష్ట్రానికీ లేనటువంటి ప్రత్యేక ప్రతిపత్తిని ఈ ఆర్టికల్ జమ్మూ-కాశ్మీర్‌కు కల్పిస్తుంది. ఉదాహరణకు ఈ ఆర్టికల్ ప్రకారం జమ్మూ-కాశ్మీర్‌లో, భారతదేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు, స్థలాలు కొనడం, అమ్మడం చేయరాదు.

**వాస్తవం :** రాజ్యాంగం ప్రకారం ఒక ప్రాంతానికి లేక రాష్ట్రానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం అనేది ఒక జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రానికే పరిమితం కాదు. అలాంటి సదుపాయాలు ఆర్టికల్ 371 ద్వారా అనేక రాష్ట్రాలకు కల్పించారు. ఈ ఆర్టికల్ ప్రకారం మహారాష్ట్రలోని విదర్భ, మరట్వాడాల్లోను, గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలోను ప్రత్యేక అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు ఆ ప్రాంతాలలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో సరైన వాటా ఇచ్చే ప్రత్యేక అధికారాలు వుంటాయి. అలాగే 371-బి అస్సాంకు, 371-సి మణిపూర్ కు, 371-ఎఫ్ సిక్కింకు, 371-హెచ్ అరుణాచల్ ప్రదేశ్‌కు, 371-ఐ గోవాకు ఇలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించింది.

ఇక స్థలాల కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో ఆర్టికల్ 370 జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక సదుపాయం కల్పించినట్లే, ఆర్టికల్ 371-ఎ నాగాలాండ్‌కు, 371-జి మిజోరాంకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఆర్టికల్ 371ఎ, ఆర్టికల్ 371-జి ప్రకారం నాగాలాండ్, మిజోరాం లో కూడా ఆయా రాష్ట్రాలకు చెందని వారు అక్కడి భూములు కొనగూడదు... అమ్మకూడదు. ఈ విషయాలలో భారత పార్లమెంటు చేసే చట్టాలు కూడా ఆ రాష్ట్రాలకు వర్తించవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కూడా 1/70 చట్టం అమలులో వుంది. ఆ చట్టం ప్రకారం ఈ రెండు తెలుగు రాష్ట్రాలలోని గిరిజన ప్రాంతాలుగా ప్రకటించబడ్డ ప్రాంతాలలో గిరిజనులు మాత్రమే భూములు కొనాలి.. అమ్మాలి. గిరిజనేతర ప్రజలు, వారు భారతీయులైనా సరే ఆ ప్రాంతాలలో భూములు కొనకూడదు.. అమ్మరాదు. ఇలా 370, 371-ఎ, 371-జి, 1/70 చట్టాలను రాజ్యాంగంలో ఎందుకు పొందుపరచారు? ఎందుకు అమలు చేస్తున్నారు? ఎందుకంటే ఆయా ప్రాంతాలు తీవ్రంగా వెనుకబడి వున్నాయి. అక్కడ కొనుగోళ్లకు భారతీయులలోనే వేరే ప్రాంతాల వారికి అవకాశమిస్తే, వెనుకబడిన ఆయా ప్రాంతాల వాళ్లను వేరే ప్రాంతాల వాళ్లు మోసం చేస్తారనే సందేహంతో, ఆ ప్రాంతాల వారి ఆస్తులకు ప్రత్యేక రక్షణ నిమిత్తం రాజ్యాంగంలో కొన్ని ఆర్టికల్‌లు, కొన్ని ప్రత్యేక చట్టాలు చేశారు. ఆర్టికల్ 370 ఒకటే ప్రమాదకరమనీ, దానిని ఎత్తివేయాలనీ ప్రచారం చేయడం వాస్తవాన్ని వక్రీకరించడమే.

**అబద్ధం 3 :** ఆర్టికల్ 370 మూలంగా జమ్మూ-కాశ్మీర్ ప్రజలు భారతదేశ సార్వభౌమాధికారాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ చిహ్నాలను అవమానించినా, ఎటువంటి నేరమూ కాదు.

**వాస్తవం :** ఇది శుద్ధ అబద్ధం. ఆర్టికల్ 370లో అలాంటి అంశమే లేదు. అలాంటి అంశం ఉందని చెప్పడం స్వాతంత్ర్య సమర యోధులైన రాజ్యాంగ నిర్మాతలందరినీ అవమానించడమే. స్వాతంత్ర్య పోరాట వీరులైన రాజ్యాంగ నిర్మాతలు తమ జాతీయ పతాకాన్ని అవమానిస్తే నేరం కాదని రాజ్యాంగం లోని ఒక ఆర్టికల్‌లో రాశారని ప్రచారం చేయడం అబద్ధాలకు పరాకాష్ట!

**అబద్ధం 4 :** సుప్రీం కోర్టు తీర్పులు ఈ రాష్ట్రంలో పని చేయవు.

**వాస్తవం :** ఇది మరో పెద్ద అబద్ధం. ఉదాహరణకు 2016లో 'జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం ఆర్టికల్ 370 కారణంగా సర్వసత్తాక అధికారాలు కలిగిన రాష్ట్రం' అని ఆ రాష్ట్ర హైకోర్టు పేర్కొంటే దానిని 2016 డిసెంబరులో సుప్రీం కోర్టు కొట్టివేసింది. జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం సర్వసత్తాక దేశమైన ఇండియాలో ఒక భాగమని పేర్కొంది. ఆ తీర్పును జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర హైకోర్టు గానీ, ప్రభుత్వం గానీ వ్యతిరేకించలేదు. సుప్రీం కోర్టు తీర్పులే కాదు, రాష్ట్రపతి ఉత్తర్వులు కూడా ఈ రాష్ట్రంలో వర్తిస్తున్నాయి. ఉదాహరణకు 11-2-56, 19-2-94ల మధ్య జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి రాష్ట్రపతి 47 ఉత్తర్వులు ఇచ్చారు. అన్ని ఉత్తర్వులను ఆ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది.

**అబద్ధం 5 :** జమ్మూ-కాశ్మీర్‌లో ఉండే కాశ్మీర్ యువతి దేశంలో వేరే రాష్ట్ర పౌరుడిని పెళ్లి చేసుకుంటే, ఆమెకు కాశ్మీరీ పౌరసత్వం రద్దవుతుంది. అదే, పాకిస్తాన్ యువకుడిని పెళ్లి చేసుకుంటే మాత్రం, పెళ్లి చేసుకున్న భర్తకు కాశ్మీరీ పౌరసత్వం లభిస్తుంది.

**వాస్తవం :** ఈ ప్రచారం కూడా అబద్ధమే. ఇలాంటి అంశమేదీ ఆర్టికల్ -370లో లేదు. కాకపోతే రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డరు ప్రకారం 35-ఎ ఆర్టికల్ అమలులోకి వచ్చింది. దానికి అనుగుణంగా జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర శాసనసభ ఒక తీర్మానం చేసింది. దాని ప్రకారం ఆ రాష్ట్రంలోని పురుషుడు వేరే రాష్ట్ర యువతిని పెళ్లి చేసుకుంటే, వారి సంతానానికి వారసత్వ హక్కులు లభిస్తాయి. అదే కాశ్మీర్ యువతి వేరే రాష్ట్రానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకుంటే, వారి సంతానానికి ఆ రాష్ట్ర పౌర హక్కులు, వారసత్వ హక్కులూ లభించవు. అంతేకాని, పాకిస్తాన్ పౌరుడిని పెళ్లి చేసుకుంటే, ఆమె భర్తకు కాశ్మీర్ పౌరహక్కులు లభిస్తాయనడం పూర్తిగా తప్పుడు ప్రచారం.

**అబద్ధం 6 :** కాశ్మీర్‌లో మైనారిటీలకు (హిందువులు, సిక్కులు, బౌద్ధులు) రాజ్యాంగ బద్ధంగా రావలసిన 16 శాతం రిజర్వేషన్లు అమలు కావడం లేదు.

**వాస్తవం :** ఇది కూడా అబద్ధ ప్రచారమే. రాజ్యాంగం భారతదేశం మొత్తంలోను కొందరిని మైనారిటీలుగా నిర్ణయించింది. వారు ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, జొరాష్ట్రియన్లు (పార్సీలు). అంతేకాని, ప్రతి రాష్ట్రానికీ వేరు వేరుగా మైనారిటీలు నిర్ణయించబడలేదు. పంజాబ్‌లో సిక్కులు సంఖ్యలో మెజారిటీ, హిందువులు మైనారిటీ. నాగాలాండ్, మిజోరాం, లక్షద్వీప్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లో క్రైస్తవులు సంఖ్యలో మెజారిటీ, హిందువులు మైనారిటీగా ఉంటున్నారు. కాని రాజ్యాంగం దేశానికంతటికీ మాత్రమే మైనారిటీలను నిర్ణయించిన కారణంగా ఆ రాష్ట్రాలలో కూడా పైన చెప్పిన ఆరు మతాల వారు మాత్రమే, మైనారిటీలుగా పరిగణించబడుతున్నారు. ఉదాహరణకు పంజాబ్‌లో సిక్కులు మెజారిటీ సంఖ్యలో ఉన్నా, రాజ్యాంగం ఆ రాష్ట్రంలో కూడా సిక్కులను మైనారిటీగానే గుర్తిస్తోంది. అలాగే జమ్మూ-కాశ్మీర్‌లోని కాశ్మీర్ ప్రాంతంలో ముస్లింలు సంఖ్యలో మెజారిటీగా ఉన్నా, ప్రాంతంలో బౌద్ధులు సంఖ్యలో మెజారిటీగా ఉన్నా రాజ్యాంగం ఆ రాష్ట్రంలో ఆ రెండు మతాల వారినీ మైనారిటీలు గానే గుర్తిస్తోంది. ఇదీ వాస్తవం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, అంకూర్ శర్మ అనే న్యాయ వాది జమ్మూ-కాశ్మీర్‌లో హిందువులను మైనారిటీ లుగా గుర్తించమని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిల్ వేస్తే, సుప్రీంకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న వేసింది. అదేమిటంటే, 'జమ్మూ-కాశ్మీర్‌లో హిందువులను మైనారిటీలుగా గుర్తిస్తారా?' అని. దానికి ఆ రాష్ట్రంలోని పిడిపి- బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం 'హిందువులను మైనారిటీ లుగా గుర్తించం' అని స్పష్టమైన సమాధానం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అసలు సమాధానమే ఇవ్వలేదు. దానిపై ఆగ్రహించిన సుప్రీంకోర్టు రూ. 15 వేల జరిమానా వేసింది. అయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మౌనంగానే ఉంది (ది పయనీర్ 7-2-17). ఇంత స్పష్టంగా ఆ రాష్ట్ర వైఖరీ, మౌనాన్ని ఆశ్రయించిన కేంద్ర వైఖరీ వుంటే, రాజ్యాంగ బద్ధంగా రావలసిన రిజర్వేషన్లు జమ్మూ-కాశ్మీర్‌లోని హిందువులకు అందడం లేదనే ప్రచారం ఎంత మోసపూరితం?

ఇలా ఆర్టికల్-370 ద్వారా హిందువులకు అన్యాయం జరుగుతోందంటూ అబద్ధ ప్రచారాలు చేసి, మతాల మధ్య విభేదాలు సృష్టిస్తోన్న వారి పట్ల దేశ భక్తులందరూ అప్రమత్తంగా ఉండి, వారి విద్వేష ప్రచారాన్ని, విద్రోహ చర్యలను అరికట్టడమే నేటి తక్షణ కర్తవ్యం

– బోస్

# అల్లాహ్ దయగలవాడు

**అల్లాహ్ మనకు అనేక పరీక్షలు పెట్టినప్పటికీ మనం ఆయనకు విధేయులమై ఉన్నామని తెలుసుకోగానే మనకు రెట్టింపు శుభ ఫలితాలు ఇస్తారు.. అందుకు ఉదాహరణగా బక్రీద్ నిలుస్తుంది.**

బక్రీద్ పండుగ అనగానే ప్రవక్త హజరత్ ఇబ్రహీం (అలైహి) తన ఏకైక కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్‌ను దైవమార్గంలో జిబాహ్ చేయడానికి ప్రయత్నించిన సంఘటన మనకు గుర్తుకు వస్తుంది. హజరత్ ఇబ్రహీం (అలైహి) తన 86వ సంవత్సరపు వృద్ధాప్యంలో తనకు లేకలేక కలిగిన ఏకైక సంతానం హజ్రత్ ఇస్మాయిల్‌ను జిబాహ్ చేస్తున్నట్లు కలగంటాడు. కలలో చూసిన దృశ్యాన్ని దేవుని ఆజ్ఞగా భావించి, నిజంగానే తన ముద్దుల తనయుడిని దేవుని ప్రసన్నత కోసం జిబాహ్ చేయడానికి ఉద్యుక్తులవుతారు. ఆ మహనీయుని త్యాగ నిరతిని మెచ్చిన దైవం ఇస్మాయిల్ మెడపై కత్తిని తెగకుండా చేసి అందుకు బదులుగా పొట్టేలు బలిఇవ్వమని ఆదేశిస్తారు. ప్రవక్త ఇబ్రహీం అ ప్రకారంగానే పొట్టేలును బలి ఇస్తారు. తండ్రీ తనయుల అపూర్వ త్యాగానికి గుర్తుగా ఈదుల్‌జుహా పేరుతో ఈ పర్వదినాన్ని నిర్వహించడం ప్రపంచ వ్యాప్తంగా ఆనవాయితీగా వస్తోంది.

**లబ్బైకా అల్లాహుమ్మ లబ్బైక్,**
**లబ్బైకా లా షరీకా లక లబ్బైక్,**
**ఇన్న అల్‌హమ్ద వల్-ని-మత లక**
**వల్-ముల్క్, లాషరికాలక్**

ప్రపంచ ముస్లింల ఆధ్యాత్మిక క్షేత్రం, దైవ గృహం అయిన కాబాకు హజ్ విధులు నిర్వహించేందుకు వచ్చిన హాజీల నోట అనునిత్యం వెలువడే స్తోత్ర వచనాలు ఇవి.. జిల్‌హజ్జా నెలలో హజ్ పండుగను ఖుర్బానీల పండగని, ఈదుల్ అజ్హా అనికూడా పేర్కొంటారు.

"లబ్బైక్ అల్లాహుమ్మలబ్బైక్" అనే శబ్దం ఒక అపూర్వమైన, అనిర్వచనీయమైన మధురానుభూతి. ఆధ్యాత్మికతతో పాటు భాషా పరంగా చూస్తే, అరబ్బీ భాషలోని శబ్ద ప్రక్రియ ఒక ప్రత్యేకత ఉంది. అరబ్బీ భాషలో అవతరించిన పవిత్రఖురాను గ్రంథాన్ని నియమబద్ధంగా, లయబద్ధంగా, పారాయణం చేయడాన్ని ధార్మిక భాషలో "తజ్‌వీద్" అంటారు. పారాయణాన్ని 'ఖిరాత్' అని, పారాయణం చేసే వారిని 'ఖారీ' అని అంటారు. అరబ్బీ భాషలోని "అల్లాహ్" అనే పదం దీనికి మరో నిర్వచనంగానీ, సరిపోలిన మరోపదంగానీ లేదు. విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా ఇదే పదం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. " అల్లాహ్ అన్న పదాన్ని సాధారణంగా దేవుడు, దైవం అంటాం. ఆంగ్లంలో గాడ్ అంటాం. ఇస్లామీయుల ప్రకారం సర్వసృష్టికర్తను ఒక్కో భాషలో ఒక్కో పేరుతో పిలుస్తూ ఉండవచ్చు. కానీ అన్ని భాషా పదాల్లో "అల్లాహ్" అన్నది అత్యంత విలక్షణమైన పదం. ప్రపంచవ్యాప్తంగా మహమ్మదీయులు సృష్టికర్తను సూచించే, పలికే ఏకైక పదం "అల్లాహ్", ఇస్లాం మతాన్ని అనుసరించే విశ్వవ్యాస్తంగా ఎక్కడ ఏ భాష మాట్లాడే వారైనా సరే తమ ప్రభువును "అల్లాహ్" అని మాత్రమే పిలుస్తారు. హజ్ యాత్రకై వెళ్ళే వారందరూ కొన్ని పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. వాటిల్లో కొన్ని 1) డ్రెస్ కోడ్ :హజ్, ఉమ్రా యాత్రికుల డ్రెస్ కోడ్‌ను "ఎహరామ్" అంటారు. ఇందులో పురుషులు కేవలం శరీరంపై ఓ శాలువాలాంటి తెల్లటి దుప్పటి కప్పుకోవాలి మహిళలైతే శరీరాన్ని దుస్తులతో నిండుగా కప్పుకోవాలి. ముఖంపై "పరదా దరించరాదు. ఎహరామ్ ధరించిన ప్రతి ఒక్కరు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సువాసలు పెట్టుకోవడం, తలలో పేలు చంపడం నిషేదం.



**ఉమ్రా :** హజ్‌కు ముందు ఉమ్రా చెయ్యాలి. "అల్లాహుమ్మా ఇన్ని ఉరీదు హజ్జ తమతోయి" అని నియత్ చేసుకోవాలి. కాబతుల్లా (మక్కా) చుట్టూ ప్రదక్షిణ చేయాలి. సఫా, మర్వా రెండు పర్వతాల మధ్య నడవడం), శిరోమండనం చేయించుకోవాలి పురుషులు. స్త్రీలు మాత్రం కేవలం నాల్గు అంగుళాలు కత్తిరించుకోవాలి. దీన్ని ఉమ్రా అంటారు

**జిల్‌హజ్జ :** ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన ప్రతి ముస్లిం ఫరజ్ సమాజ్ చదివి మాక్కానుంచి మీనా అనే ప్రాంతానికి వెళ్ళాలి. అక్కడే రాత్రి బస చేయాలి. మరునాడు ఫజర్ నమాజ్‌ను జొహర్‌లోనే (ఏకకాలంలో) పాటించాలి. అక్కడి నుండి బయలుదేరి "ముజ్దలిఫా" ప్రాంతానికి చేరుకోవాలి. అక్కడ మగ్‌రిబ్, ఇషా నమాజులు రెండు ఏకకాలంలో జరుపుకొని రాత్రి అక్కడే బస చేయాలి. మరుసటి రోజు ఉదయం ఫజర్ తర్వాత మీనాకు వెళ్ళాలి. ఇది ఫర్జ్.

**మీనాలోనే ఖుర్బానీ విధిని పూర్తి చేయాలి**

మీనా చేరుకున్న తరువాత జొహర్ లోపు ఆ ప్రాంతంలో ఉన్న మూడు పిల్లర్లకు ఏడు కంకరరాళ్ళ కొట్టాలి. ఈ కార్యాన్ని 'జమ్రాత్' అంటారు. మొదటిసారి రాయి కొట్టినప్పుడు "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్" అనాలి. మిగిలిన ఆరు రాళ్ళు కొట్టేటప్పుడు "అల్లాహు అక్బర్" అనాలి. ఆ తర్వాత ఖుర్బానీ ఇవ్వాలి. ఈ రెండు రోజులు హాజీలు మీనాలోనే ఉండి జొహర్ తర్వాత మగ్రిబ్ లోపు కాబతుల్లా చుట్టూ ప్రదక్షిణ చేయాలి. దీన్ని "తలపై జియారా" అంటారు. ఇది ఫర్జ్. తవాఫ్ చేయకపోతే హజ్ అసంపూర్తి అవుతుంది. 4) ఆబెజమ్‌జమ్ : హజ్ యాత్రకు వెళ్ళినవారు రోజూ కడుపారా అబెజమ్‌జమ్ స్వీకరిస్తారు. తిరిగి తమతమ ప్రదేశాలకు వచ్చేప్పుడు సుభప్రదమైన జమ్‌జమ్ నీళ్ళు తెచ్చుకుంటారు. ఆ నీరు తాగితే ఆకలి కాదు. సర్వరోగాలు నయమవుతాయని నమ్మకం. ఇది అత్యంత పరిశుద్ధ జలం, దీని సుగుణాలు శాస్త్రీయ పరిశోధనల్లో రుజువులుగా తేలాయి.

– ఖాన్

# వాన కురిసె.. చేను మురిసె



**రాజధాని వార్తలు, అమరావతి :** గడచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు తగ్గింది. గత వారం 27 శాతం లోటు వర్షపాతం ఉంటే ఇప్పుడది 19 శాతానికి తగ్గిపోయింది. ఈ వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాగు పనులు ఊపందుకున్నాయి. దీంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 17.54 లక్షల హెక్టార్లకు పెరిగింది. కృష్ణా, గోదావరి డెల్టాల్లో వరి నాట్లు పుంజుకున్నాయి. గోదావరి వరద తాకిడికి గురైన ప్రాంతాలు మినహా ఉభయ గోదావరి జిల్లాల్లోనూ నాట్లు జోరుగా పడుతున్నాయి. అలాగే విశాఖ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వర్షాధారిత పంటలతోపాటు నీటి వసతి ఉన్న ప్రాంతాల్లోనూ వరి నాట్లు ప్రారంభించారు. అయితే రాయలసీమ జిల్లాలు మాత్రం ఇంకా లోటు వర్షపాతంలోనే ఉన్నాయి.

నాలుగు రాయలసీమ జిల్లాలుసహా మొత్తం ఏడు జిల్లాలు బుధవారానికి 20 శాతం నుంచి 50 శాతం వరకు లోటు వర్షపాతంలో ఉన్నాయి. విశాఖపట్నం, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు సాధారణ స్థితిలో ఉండగా శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం, కర్నూలు జిల్లాలు లోటు వర్షపాతంలో ఉన్నాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వచ్చే రెండు మూడు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మరికొన్ని జిల్లాల్లోనూ పరిస్థితి మెరుగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అదే జరిగితే పంటల సాగు విస్తీర్ణం వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని చేరుతుందని భావిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని రిజర్వాయర్లకు ఇప్పుడిప్పుడే నీరు రావడం ప్రారంభమైంది. ఈసారి శ్రీశైలం, సాగర్‌లు నిండేందుకు ఆస్కారం కనిపిస్తున్నందున సాగర్ కుడికాలువకు నీరిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**తగ్గిన వర్షపాతం లోటు...**

ఈ ఖరీఫ్ సీజన్‌లో నైరుతీ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో మొత్తంగా 556 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉంది. ఈ క్రమంలో ఇప్పటికి 275.4 మిల్లీమీటర్ల వర్షం కురవాలి. అయితే 224.1 మిల్లీమీటర్లే కురిసింది. అయితే గత వారం 27 శాతం లోటు వర్షపాతం ఉండగా.. తాజాగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మెరుగైంది. వర్షపాతం లోటు ప్రస్తుతం 19 శాతానికి తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం సైతం పెరుగుతోంది. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణం లక్ష్యం 38.30 లక్షల హెక్టార్లుగా ఖరారు చేశారు. సాధారణ పరిస్థితుల్లో ఇప్పటికి 22.17 లక్షల హెక్టార్లు అంటే సుమారు 79 శాతం విస్తీర్ణంలో పంటలు వేసి ఉండాల్సింది. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు.

ఇప్పటివరకు 17.74 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వేసిన పంటల్లో ఎక్కువగా జొన్న, సజ్జ, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలతోపాటు వరి ఉంది. మొక్కజొన్న, రాగి, కంది, పత్తి, చెరకు వంటి పంటలైతే 75 శాతం వరకు వేసినట్టు వ్యవసాయ శాఖ లెక్కలేసింది. ఈ సీజన్‌లో ఇప్పటికి 7.44 లక్షల హెక్టార్లలో వరినాట్లు పడాల్సి ఉండగా.. 6.33 లక్షల హెక్టార్లలో వేశారు. ఖరీఫ్‌లో మొత్తంగా 15.19 లక్షల హెక్టార్లలో వరి పంటను సాగు చేయాలన్నది లక్ష్యం. ఇదిలా ఉంటే.. గోదావరి వరదలతో నీట మునిగి దెబ్బతిన్న వరి నారు మళ్లు తిరిగి పోసుకునేందుకు వీలుగా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com